<u>కథానికః</u>

నిలి నవ్వెన

★

శ్రీ బి. హెచ్. కృష్ణమూర్తి

వాచ్ చూసుకున్నాడు భాను. రెండున్నరయింది. నాగమణి అంటున్నది. పావురంలా మెడ ఒక పక్కకు వంచి, సూదిలో దార మెక్కిస్తూ "అవతలి గదిలో ఉన్నాయన ఇందాకంటున్నాడు ఆవిడతో, 'మొగుడు పెళ్ళాలంటే అలా ఉండాలి, ఒకళ్లను చూసైనా నేర్చుకోం మనం' అని, మన నుద్దేశించేను. నవ్వొచ్చింది. మనన్నిలా అనుకుంటున్నందుకు, వాళ్లొచ్చిన రెండు రోజులై చూస్తున్నాను, ఎందుకో అస్తమానం కీచులాడుకుంటూనే......"

ఇంకా ఆమె ఏవో చెప్తున్నది కాని వర్తమానంలో పయనిస్తున్న అతని మనస్సు ప్రవాహ మధ్యంలో ఏవో అడ్డు తగిలి ఆగిపోయిన రెమ్మలా అయిపోయింది.

మొగుడూ పెళ్లాలు! ఈ నాలుగు రోజుల్లో ఎంత చక్కగా అమరిపోయింది నాగమణి యీ రకపు జీవితానికి! అతి నిపుణంగా, తెలగడా గలీబుమీద లతలూ పూలూ కుట్టడంలో, కదలుతూన్న ఆమె వేళ్లమీద నిలిచా యతని చూపులు. ఈ ఎంబ్రాయిడరీ సరంజామా నిన్ననే కొని తెచ్చాడు తాను. అప్పుడే ఎన్ని డిజైన్లు కుట్టింది!

గదంతా కలయజూచ చూశాడు. ప్రశాంతమైన సాంసారిక వాతావరణం ఎంతగా అలుముకుంది యీ హోటలు గదిని! నాగమణి—ఎంత చక్కని పేరు!

లాభం లేదు.

జేబు తడిమి చూసుకున్నాడు, మెరమెర లాడుతూ తగిలింది కాగితం వేళ్లకు. నాలుగు పంక్తులే రాసినది తానా ఉత్తరంలో—కాని అరగంట పైగా పట్టింది అది రాయడానికి. పేపరు కొనుక్కొని వస్తా నని వెళ్లిన వాడింత ఆలస్య మెందుకు చేస్తున్నాడా అని ఆమె ఆశ్చర్యపడి ఉండవచ్చు. ఎంత అదుర్దాగా తన రాకకోస మెదురు చూస్తుందేది! కిటికీ ఊచ నొక చేతితో వదులుగా పట్టుకొని రోడ్డువైపే చూస్తున్న ఆమె కళ్లనుండి ఎక్కడో దూరాని కెగిరిపోతున్న ట్లున్నాయి ఏవో తలపులు ఈవేళకూడా..

మళ్లీ ఆమెమీద నిశ్చలంగా నిలిచా యతని చూపులు. పువ్వు కుట్టడం పూర్తయిపోయింది. ప్రక్కను నిన్న తాను పెన్సిలుతో రాసిన మొగ్గ ముడుచుకొని ఉన్న రేకులమీద లేతగులాబీ దారంతో ముద్దుముద్దు కుడుతూన్న దామె. చంటిపిల్లవాడికి పాలిస్తున్న ఒక స్త్రీమూర్తి మెరసిందతని మనోవీధిలో, లేనవ్వుతో కదలుతున్నా యా పెదవులు; "నీకోసమే!"

ఊహాప్రపంచంనుండి బలవంతాన మనసు మళ్లించుకుని ఆమె మాటలమీద నిలిపాడు.

ఆమె తల పైకెత్తి తన కళ్లలోనికి తిన్నగా చూస్తూ అంది: "ఈవాళేగదూ వెళ్లిపోవడం? ఈ నాలుగురోజులూ మందే అనుకున్న యీ గదిని వదిలేసి......" కొద్దిగా సెంటిమెంటల్ గా అయి మాట్లాడుతున్న ఆమె పెదవులమీద చిన్న చిరునవ్వు కదలాడ్తూ ఉంది. ఆ నవ్వు బరువుగా ఉన్నట్లుండడం తన ఊహేనేమో!

భాను అన్నాడు నవ్వుతూ, "గదిలో ఏముంది?"

ప్రవాహంలో ప్రయాణం మొదలుపెట్టిన రెమ్మ మళ్లీ ఏదో అడ్డు తగిలి అక్కడే కొట్టుకోవడం మొదలుపెట్టింది.

పై దేశంలో ఈ గదీ, ఈ మనిషీ, నాలుగు రోజుల్లో ఎంత సన్నిహిత మయ్యాయి తనకు!

నాలుగు రోజుల క్రిందట—

భువనేశ్వరం స్టేషన్లో రైలాగింది. అంత వరకూ మోకాళ్లతో తనను పొడుస్తూన్న ముసుగులోని యువతి దిగి వెళ్లిపోయింది తన భర్తతో, విశాలంగా కూర్చోవచ్చుగదా అనుకుంటుండగానే మరో ముగ్గురు వచ్చి ఆ జాగాలో కూర్చున్నారు. దైనందిన జీవితంలో పాటించవలసిన ఆర్థిక సూత్రాలను తనకు బోధపరిచి ఒప్పించి థర్డ్ క్లాస్ టికెట్లు కొనిపించిన నారాయణమీద ఎక్కడలేని కోపం వచ్చింది.

ప్రక్కనే కూర్చొనిఉన్న నారాయణ తన అంతులేని మాటలధోరణి ఉన్నట్టుగా మార్చి నెమ్మదిగా అన్నాడు: "చూడు భానూ— నేను చెప్పానుగదూ వెయ్యి మందిలో ఉన్నా తెలుగు మొహం ఇట్టే పట్టెయ్యొచ్చు. అదిగో, అవతల, ఆ చివర చిన్న బెంచీమీద యూడో మనిషి. పందేమేసి చెప్తా నవ్వాయి, ఆ మనిషి మన తెలుగుదే!"

తనదృష్టి ఆవైపు పోనిచ్చాడు భాను. మాసిపోయిన ఆకుపచ్చరంగు చీరా, తెల్లజాకెట్టూ, జడవేసుకోకుండా ముడుచుకొన్న ఒత్తైన జుట్టూ, చామనచాయగా ఉన్నా ఆకర్షణీయంగా ఉన్న

యువతి—తరువాత తెలిసింది ఆమె వయసిరవై రెండేళ్ళని, అప్పటికి మటుకింకా చిన్నదిలాగే కనిపించింది తన కళ్లకు—చేతిలోని నీలంగా ఉన్న ఏదో వస్తువుమీద గోళ్లతో గాస్తున్నది.

నారాయణంటున్నాడు: "అరే, మనెవరూ లేరే ఆ చుట్టుపక్కల తెలుసువాళ్లు! ఒక్కరితే ఎక్కడికి చెప్మా వెళ్తున్నది, ఎవరోగాని?"

ఆమాట నిజమేలా ఉంది. ఆ చుట్టుపక్కల మనుష్యులకూ ఆమెకూ సంబంధమున్నట్లు లేదు. తానన్నాడు: "ఎవరైతే మనకేం లెద్దూ." ఆ మాట అంటున్నప్పుడు ఇంతగా ఆమెతో తనకు ప్రమేయం కలుగుతుందని తాననుకోలేదు గాని మనసులో మటుకు కొద్దిగా ఆశ్చర్యమైంది.

తన కిటువంటి విషయాల్లో అనుభవం లేదు గాని, విచిత్రమైన మనిషి నారాయణ, ఎలా పరిచయం కలుగజేసుకున్నాడో, ఆ కాస్తపాటి టైములో ఆవిడతో. ట్రెయిన్ బరాంగ్ స్టేషన్‌లో ఆగింది. ఎలాగూ ట్రెయినక్కడ అరగంట పైగా ఆగుతుందిగదా, అలా తిరిగివద్దామని తానన్న మాట ఒప్పుకోనని నారాయణ నక్కడే వదలి, తాను వెళ్లి అలా తిరిగి, బండి కదుల్తుందనగా వచ్చాడు కంపార్ట్‌మెంట్ లోపలకు. తాము మొదట కూర్చున్న సీట్లుమార్చి, ఆవిడ కూర్చున్న బెంచీమీదకు చేరి, ఆమెతో ఏదో మాట్లాడుతున్నాడు నారాయణ. చచ్చినా తానంత చొరవ చెయ్యలేడు.

తాను రావటంతోనే పక్కనుంచిన కంఫర్టర్ అవతలకు తోసి నారాయణ అన్నాడు: "రా, భానూ. పాప మీవిడ విజయనగరమెళ్లాలిట, వాళ్ల పినతల్లిగారింటికి. ఖుర్దాలో యీ బండి మారాలని తెలియక ఇందులోనే ఉండిపోయింది. ఎవరో చెప్పారట ఇదే నేరుగా వెళ్తుందని—"

కూర్చుని తానామె వైపు చూశాడు. చేతిలో ఉన్న నీలిదువ్వెన పళ్లు గోళ్ళతో గీస్తూ తల వంచుకొని కూర్చుని ఉందామె. జాలి వేసింది తనకు. కాని నారాయణలా పైకి చూపెట్టలేక పోయాడు. ఏదో మాట అనవలసిన బాధ్యత తనమీద ఉన్నట్లనిపించి అన్నాడు తాను: "కొత్త జాగాల్లో సరిగా కనుక్కోవలిసింది. ఏ టికెట్ కలెక్టర్‌నడిగినా చెప్పిఉండును."

ఏమాత్రపు కదలికా లేకుండా అంత బిజినెస్‌లైక్‌గా మాట్లాడినందుకు మందలిస్తూ నారాయణన్నాడు: "బాగా చెప్పావోయ్! పాప మాడమనిషి. అయినా ఇప్పుడేం మించిపోయిందిలే కటక్‌లో దిగి మళ్లీ అటునుంచి రాత్రి రెండుగంటలకొచ్చే పాసెంజర్‌లో వెనక్కు వెళ్లిపోతుంది."

"అనుకున్న దానికి మరోక పదిగంట లాలస్యంఅని, అంతకు మించి మరేం నష్టం అనికూడా తానను కలబోయాడు భాను— కాని ఆమె తనవైపు అదోక రకంగా చూస్తూ ఉండడం గమనించి ఆమాట అనలేదు.

తానూ నారాయణా సిగరెట్టు వెలిగించుకున్నారు. రెయిల్ ట్రెయిన్ పెద్దచప్పుడు చేస్తూనడుస్తున్నది—కాట్జోడి బ్రిడ్జిమీద, తనకు ప్రత్యేకంగా వేశారుగదా ఇది అన్న గర్వంతోలాగు. ఆమె అంతగా మాట్లాడినట్లు లేదు కాని ఆ రైలు హోరులో నారాయణ మాటలు మటుకు అక్కడక్కడ వినిపిస్తున్నాయి; వినాలని తన కంత ఆసక్తిగా కూడా లేదు. ఇంకో అయిదు రోజుల్లో మళ్లీ వెనక్కి బ్రిడ్జిమీదనుంచే తన ఊరికి వెళ్లిపోతానుగదా అనుకుంటున్నాడు.

కటక్ స్టేషన్ చేరుకుని రైలాగింది. నారాయణా, ఆమే, లేచి నిల్చున్నారు. పైన ఉంచిన చేతిసంచీ తీసుకుని తానూ నిలబడ్డాడు.

నారాయణ ఆవిడతో అంటున్నాడు: "ఇదే కటక్—సామాన్లేవీ లేవుగదూ?" ఆ గొంతులో ఉన్న చనువు చూసి తనకాశ్చర్యమైంది. ఆమె నెమ్మదిగా "లేవు" అని తనచేత నున్న మడతపెట్టిన గోధుమరంగు చీరవైపూ నీలిరంగు దువ్వెన వైపూ చూచింది. వాలిఉన్న ఆమె కనురెప్పలక్రింద నీళ్లుకూడుకొంటూ ఉన్నాయేమో!

భూతకాలంలో తిరుగుతున్న మనస్సు మళ్లా హోటలు గదిలో ఉన్న నాగమణిమీదకు వాలింది. తనను చుట్టివున్న వస్తుసంచయమంతా తనదే అయినా ఆ స్పృహే లేని శ్రీమంతురాలి ధీమాతో, ఎంత సహజంగా కూర్చొని ఉంది ఈ గది నడుమ!

ఆమె అంటున్నది: "సరదా ఉందిగాని మన స్నసలు పుస్తకంమీద పట్టుమని పావుగంట నిలవదు......"

మళ్ళా ఆగిపోయింది రెమ్మ.

నారాయణ అంటున్నాడు: "ఎక్కేవాళ్లూ, దిగేవాళ్లూ—పద. భానూ. నిలబడితే ఎంతసేపైనా అంతే!" మాట్లాడకుండా దిగాడు తాను, తన వెనక వాళ్లూ దిగారు.

ప్లాట్‌ఫారమ్‌మీద అన్నాడు నారాయణ: "దూరపువాడివి, సిటీబస్సులో వెళ్ళాలిగదూ, నువ్వు? నే నీ మనిషిని పంపించేశాక వెళ్తాను, నువెళ్లు. అన్నట్లు—నీ పని మరో మూడురోజుల్లో అయిపోతుందిగదూ, వెళ్ళేముందోకసారి కనుపించు."

"అలాగే, వస్తాను మరి."—వెళ్లిపోయేముందు ఆమెవైపు చూశాడు తాను, ఆమెకూడా తనవైపే చూస్తున్నది. మళ్ళా తల తిప్పుకుని పదడుగులు నడిచాడు. నారాయణంటున్న మాటలు వినిపించాయి: "దగ్గిరే హోటలు—ఇంకా నాలుగు గంటలకైముంది బండికి, భోంచేసి రావచ్చు."

ఎందుకో అనిపించింది ఆమె ఇంకా తనవైపే చూస్తున్నదని కాని వెనుకకు తిరిగి చూడకుండా మనుష్యులలో కలిసిపోయి అవతలకు వెళ్లిపోయాడు తాను. అవతల సిటీబస్సు సిద్ధంగా ఉంది. వెళ్లి లోపలకు చొరబడ్డాడు.

అప్పుడే వర్షం పడి వెలిసినట్లుంది. అక్కడక్కడ రోడ్డుమీద ఉన్న గోతుల్లో నిండుకొన్న నీళ్లల్లో ఎలక్ట్రిక్ లైటు వెలుగులు పడి ఆ చిన్న అలలు బంగారు రేకుల్లా తళతళ లాడుతున్నాయి. బస్సు వేగంగా వెళ్ళిపోతున్నది.

నారాయణ—

నారాయణసంగతి జ్ఞాపకం వచ్చింది. అతన్ని బాగా ఎఱుగును తాను. చిక్కిన అవకాశం పోగొట్టుకునే రకం కాదు. పాపమామె......

తన విధ్యుక్తధర్మం తప్పించుకుని పారిపోతున్నట్లనిపించి గుండె కలుక్కుమంది భానుకి. నిస్సహాయ ఐన ఆడదాన్ని నైతిక సంబంధమైన విలువలతో అంత అవసరంలేని మనిషితో వదిలేసి......

అయినా అసలామె ఇంకా చాలా దూరం వెళ్ళాలి. నారాయణలాంటి వాళ్లెంతమందో ఉంటారు ప్రపంచంలో, తనకెందుకీ అనవసరపు బాధ్యత ?

కాని మనసొప్పుకోలేదు. మసీదు దగ్గర బస్సాగింది. తనూ దిగిపోయాడు. బస్సు కండక్టర్ అడుగుతున్నాడు: "కోర్టువరకూ వస్తారేమో ?"

"లేదు, పనుంది."

స్టేషనక్కడకు రెండుమైళ్లుంది సుమారు. నడిచివెళ్తే ఆలస్యమౌతుంది. రిక్షావాడిని పిలిచి స్టేషన్‌కు పోనిమ్మన్నాడు. స్టేషన్ మరో రెండుఫర్లాంగు లుండనగా "ఫ్రెండ్స్ కేఫ్" తాలూకు నియాన్ లైట్ సైన్‌బోర్డ్, ఆలోచనలో ఉన్న తన కళ్ల నాకర్షించింది. తాను వస్తూన్నప్పుడు విన్న నారాయణ మాటలు జ్ఞప్తికి వచ్చాయి. స్టేషన్ దగ్గరలో ఉన్న దక్షిణాది భోజనహోటలిదే.

రిక్షాదిగి తిన్నగా భోజనాల హాల్లోనికి వెళ్ళాడు. అక్కడ చాలమంది ఉన్నారుగాని తాను వెదికే వాళ్లెక్కడా కనిపించలేదు. పక్కగదుల్లోనూ లేరు. ఇవతల హాల్లోనికి వచ్చి ఒక ఓవల్‌టిన్ తెమ్మన్నాడు.

మేనేజర్ టేబుల్ దగ్గర బిల్లు చెల్లించేటప్పుడు వాళ్లను గురించిన ప్రశ్న నోటిచివర వరకూ వచ్చింది కాని అడగలేకపోయాడు ఎందువల్లనో.

ఎందుకివన్నీ ఆలోచించి ఏంలాభం ? జరిగింది మళ్లీ వెనుకకు తిప్పి మరోవిధంగా జరిగేటట్లు చెయ్యలేడు గదా !

ఎదురుగుండా ఉన్న నాగమణిమీద దృష్టివాలింది. గులాబీ మొగ్గ కుట్టడం పూర్తయింది. సూది దానికే గుచ్చి ఫ్రేమ్ విప్పకుండానే ఆ గలేబు కుర్చీమీద ఉంచి లేచి నిలబడి ఆవలించింది నాగమణి, చేతులు రెండూ పైకెత్తి తల వెనుక పెనవేసుకుని, తన ఇంట్లో గోడకున్న త్రివర్ణ చిత్రపటం—పురూరవుణ్ణి వదలి ఆకాశాని కెగిరిపోతూన్న అతిలోక సౌందర్యవతి ఊర్వశి—అతనికి జ్ఞప్తి వచ్చింది.

భాను కూర్చున్న పడకకుర్చీ దగ్గరకువచ్చి, దాని చేతిమీద ఎడమచెయ్యివేసి వంగి, అతని కళ్లల్లోనికి తిన్నగా చూస్తూ అందామె: "మధ్యాహ్నంపూట నిద్ర బాగా అలవాటు. నేను లేది వింటున్నట్లు లేదే!"

ఆమె నున్నని మంచ మీద వేళ్లతో రాస్తూ అన్నాడు: "వింటున్నానే చివరను 'ఊదావంగులో ఉంటే బాగుంటుంది' అంటున్నావుగదూ ?"

అతని నుదుట చిందులాడు తూన్న జుట్టు కుడిచేతి వేళ్లతో సరుదుతూ అందామె: "అవునుగాని, రాత్రి ఎన్నిగంటలికి ట్రెయిను సరిగ్గా ?"

కట్టుకున్న లేపసుపు జార్జెట్ చీరా, వంగపండురం గుజ్జా అందమైన ఆమె శరీర నిమ్నోన్నతాలను పట్టి చూపుతున్నాయి, ఆకర్షవంతంగా: "రెండుంబావుకి—అన్నీ సద్దేసుకో"

"ఎంతసేపు? సాయంత్రం సరిదేస్తాను—" అంటూ అతని ఎడమచెయ్యి తిప్పి వాచీవైపు చూసింది: "అబ్బో, మూడవ్వస్తూందే! కాఫీ తెమ్మంటూ నుండండి."

తలుపు తీసుకుని ఆమె అవతలకు వెళ్లింది. వాచీవైపు చూశాడతడు— అయిదు నిముషాలు తక్కువ మూడు. నాలుగున్నరకే ట్రెయిన్, టైమవుతూన్నది.

ఎదో నిశ్చయానికి వచ్చిన వాడిలా ఒక్క ఉదుటున లేచి అల్మైరా దగ్గరకు వెళ్ళాడు. అటూ ఇటూ చూసి జేబులో చెయ్యిపెట్టి కాగితమొకటి పైకి తీసి, అల్మైరాలో ఉన్న పర్సులో పై అరలో కనిపించేలా దాన్నుంచి, మళ్లీ మూడిచి అక్కడే వదేసి వెనక్కువచ్చి కుర్చీలో చేరబడ్డాడు.

నాగమణి వచ్చింది. వెనకాలే హోటలు కుర్రవాడు ట్రేతో ఫలహారమూ, కాఫీ రెండు కప్పులూ, చిన్నగిన్నెలో పంచదారా, తెచ్చి భాను కూర్చున్న కుర్చీకి దగ్గరగా నాగమణి లాగిన స్టూలు మీద ఉంచి వెళ్లిపోయాడు. నవ్వుతూ నాగమణి అంటున్నది: గోవా బర్ఫీట ఇది—ఎలా ఉంటుందో చూడండి. చిన్నప్పుడు అమ్మ బర్ఫీ కథొకటి చెప్తుండేది—"

కొట్టుకునిపోతున్న రెమ్మ మళ్లా ప్రవాహంలో ఏదో అడ్డు తగిలి ఆగిపోయింది. ఈ నాలుగు రోజులుగా ఎక్కడలేని ఆనందమూ మూర్తీభవించినట్లు తిరుగుతున్నది నాగమణి. షెల్లీ పద్యంలో ఒక భాగం జ్ఞాపకం వచ్చిందతనికి:

"........a mortal shape indeed
With love and life and light and gaity,
And motion which may change but cannot die;
An image of some bright Eternity;
A shadow of some golden dream;........"

మళ్లా నాలుగు రోజుల క్రిందట నాగమణి స్మృతిగా మెరసింది. ఇనుపబద్దీల కానించి ఉన్న నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ల అడ్వర్టైజ్‌మెంట్ బోర్డుమీద దృష్టి నిల్పి—భార్యా, భర్తా, ఇద్దరు పిల్లలూ ఆనందంగా కలిసి కూర్చుని టీ తాగుతూన్న బొమ్మ అది—దైన్యమంతా మూర్తీభవించినట్లు కూర్చుని ఉందామె ఫస్ట్‌క్లాస్ పాసెంజర్స్ హాల్లో. మరి వాళ్లు కనిపించరని స్థిరపరచుకున్నా స్టేషన్ వదలి వెళ్లలేకపోయిన తాను, అటూ ఇటూ తిరుగుతూ, చివరకా హాల్లో ఒకమూల ఆకుపచ్చని చీర చూశాడు. నాలుగడు

సులు వేసేటప్పటికి ఆమే అని నిర్ధారణ అయింది. అతని గుండెలు వేగంగా కొట్టుకున్నాయి

భాను దగ్గరగా వచ్చేటంతవరకూ అతన్ని చూడలే దామె. చూడటంతోనే కొద్దిగా గాబరాపడి లేచి నిల్చుంది.

అతని కేమనడానికీ తోచలేదు. మాటలకు తడుముకొని చివర కన్నాడు: "భోంచేశారా?"

తా నడిగినదానికి సమాధానం చెప్పకుండా అడిగిం దామె: "మీరు వెళ్ళిపోలేదూ బస్సులో?"

"వెళ్లాను—అంటే, మళ్లీ పనుండి వచ్చాను."

"మీరు—భోజన మైందా?"

"ఊఁ."

ఇద్దరూ ఒక నిమిషం మాటాడలేదు. తా నామె కిచ్చిన సమాధానం దిద్దుకోవాలనిపించి మళ్లా అన్నాడు: "భోజనమా? ఇంకా కాలేదు." ఆమె పెదవులు కనీ కనిపించని చిరునవ్వుతో విడాయి కాని అంతలోనే "మీ భోజనం?" అని అత డన్న మాటల్లో ఆ లేజిరునవ్వు మాయమైంది. కళ్లు నేలపై వాల్చి బొటనవ్రేలుతో గచ్చుమీద రాస్తూ నెమ్మదిగా అంది: "లేదు."

"ఏం నారాయణతో హోటలుకు వెళ్లలేదూ?"

ఆమె తలెత్తి తిన్నగా అతని కళ్లల్లోనికి చూసింది. ఏదో అనడానికి ప్రయత్నించి మళ్లీ ఆగిపోయి, చివరకు "లేదు" అంది.

ఆ హాల్లో ఒక మూలనున్న దుకాణం దగ్గరకు తాను వెళ్లబోతుండగా "ఎక్కడికి?" అం దామె. "ఇప్పుడే వస్తాను" అంటూ తాను వెళ్లి తెచ్చిన రెండు బత్తాయి పళ్లూ అందించినప్పుడు వద్దని అనకుండానే తీసుకుంది. ఆపక్కనే ఒక బెంచీ అప్పుడే ఖాళీ అయింది. అది చూసి ఆమె "అక్కడ కూచోండి" అంది తనను. తా మిద్దరూ నిలబడి మాట్లాడడం తనకూ అదొక మోస్తరుగా అనిపించింది. పదిమందీ ఏ మనుకుంటున్నారో నని. వెళ్లి చివరను కూర్చొని ఆమెనూ కూర్చో మన్నాడు బెంచీ ఆ చివరను. కాని, ఆమె నేలమీద ధూళి దులుపుకొని కూర్చొని పళ్లు ఒలవడం మొదలు పెట్టింది.

ఈనెలన్నీ శుభ్రంగా తీసి ఒక పండు తన కందించిం దామె. తా నన్నాడు: "నా కొద్దు—మీరు తినండి."

"ఇంత కష్టపడి నాకోసమేనా ఒల్చుకున్నది! ఇదుండిగా నాకు!"

అయి దారు గంటల కిందట ఎవరెవరో తెలియని తమ నడుమ ఆ విధంగా మొదలైంది పరిచయం అతి సన్నిహితంగా.

"పంచదార తక్కువైనట్లుంది మీకు," అంటూ తన కప్పు తీసుకుని ట్రేలో ఉన్న చిన్న గిన్నెలోని పంచదార ఆమె కల్పుతూంటే అనుకున్నాడు తన అభిరుచు లన్నీ యీ నాల్గురోజుల్లోనూ ఎంత బాగా కనిపెట్టిం దీమె, అని—అతడు కాఫీ తాగుతున్నాడు. ప్రవాహంలో ప్రయాణాని కుద్యుక్తమైన రెమ్మ మళ్లీ ఆగిపోయింది.

తొనలు విడదీసి, గింజ లవతలకు విసిరి, రసవంతమైన ముత్యాలు తింటూ, తా నడిగాడు: "విజయనగరంలో మీ పినతల్లిగారా ఉన్నారు?"

తా నా అనవసరపు ప్రశ్న వెయ్యకుండా ఉంటే ఆ పరిచయ మక్కడితో ఆగిపోయేదేమో! ఆ మొదటిరోజు జరిగిన సంఘటనలన్నీ అలాగే అనవసరంగా కనిపిస్తున్నాయి. కాని అన్నీ జరిగాయి. ఏ ఘట్టంలోనైనా కొద్దిగా ఆలోచించి ప్రవర్తిస్తే ఇంత రాకపోయి ఉండును!

ఆమె వెంటనే సమాధానం చెప్పలేదు. ముత్యాలపొట్ట విడదీసిన తొన అలాగే వేళ్లతో పట్టుకుని దూరంగా ఉన్న *N. S. C.* బోర్డుమీద చూపులు నిల్పి కూర్చుండిపోయింది. రెప్పలు మూతబడని ఆమె కళ్లల్లో కూడుకుంటున్న కన్నీటిచుక్క లొక్కొక్కటి చెక్కిళ్లమీదనుండి, విద్యుత్కాంతిలో మిలమిలా మెరుస్తూ కిందకు రాలడం మొదలుపెట్టాయి నెమ్మదిగా.

తన కెందుకో కొద్దిగా భయం వేసింది. అటూ ఇటూ చూశాడు. సాధ్యమైనంతసేపు నిద్రపోవడానికి ప్రయత్నిస్తున్న చుట్టుపక్కలవాళ్లు తమవైపు వింతగా చూడటం లేదు. ఆ ప్రశ్న ఎంత బాధ కలిగించిం దామెకు! రెండు నిమిషాలు తానూ మాట్లాడలేదు. సంతతధారగా కారుతున్న ఆ కన్నీరు చూడలేక చివర కన్నాడు: "క్షమించండి. కష్టంగా ఉంటే చెప్పొద్దు."

చూపులు నేలమీదకు మరల్చుకుని బాష్పరుద్ధకంఠంతో అందామె: "లేదు—ఎవ్వరూ లేరు నాకు, విజయనగరంలోనే కాదు, ఎక్కడా లేరు." ఈ మాట లంటూనే వేళ్ల సందుల్లో నుండి బత్తాయితొన ఒళ్లో జార్చి, రెండు చేతులతోనూ మొగం కప్పుకుని నిశ్శబ్దంగా ఏడవడం మొదలుపెట్టింది. ఏం చేయడానికీ తోచలేదు తనకు. ఆమే చివరకు పైటచెంగుతో కళ్లు తుడుచుకొని, చెప్పడం ప్రారంభించింది:

"ఇలా చాలమం దడిగారు గాని ఎవరికీ నా సంగతి చెప్పలేదు. ఎందుకో మీకు చెప్పా లనిపిస్తున్నది......"

తరువాత నెమ్మదిగా వచ్చిం దామె జీవిత కథ. అలాంటి వాళ్లెంతమందో ఉంటా రీ దేశంలో. మామూలు అభాగ్యజీవుల కథే అది చాలావరకు. ఏం చేస్తుందో, ముందు బతు కంతా అంధకారమయం.

ఆమె మాటలు వింటున్నంతసేపు సమూలంగా ఊగులాడిపోయినమనస్సు యథాస్థానానికి స్థిరంగా చేరుకోలే దింకా. ఏం చేయగల డామెకు తాను సాయం!

ఆమె చెప్పడం పూర్తయ్యాక అయిదు నిమిషా లిద్దరూ మాట్లాడలేదు. చివర కతడు నెమ్మదిగా పర్సు తీసి పాతికరూపాయలనోట్లు పైకి తీశాడు. ఆమె తన కళ్లల్లోకి తిన్నగా చూస్తూ అంది: "జాలిపడి డబ్బిస్తున్నారా? వద్దు. నా గాథ చెప్పానని మీ దగ్గర డబ్బు లాగడం నా ఉద్దేశం కాదు." లేచి నిలబడి నేల మీద చూస్తూ అంది: మీరు చూపిన దయ చాలును." ఆమె కళ్లవెంబడి మళ్లీ నీళ్లు కారుతున్నాయి.

తాను తెల్లబోయి నోట్లు పర్సులో ఉంచి జేబులో ఉంచుకున్నాడు. ఆమె మనసు నొచ్చినట్లయింది. అయినా ఉత్తమాటలతో మటుకే సానుభూతి చూపటం తన మానవత్వానికి పెద్ద దెబ్బలా అనిపించిం దతనికి. తన ప్రకృతి సాధారణంగా ఉద్వేగం చెందదు; చెందుతే ఆపడం కష్టం. ఆ ఉద్వేగంమీదనే ముందు వెనుక లాలోచించకుండా తన ఇంట్లో చోటివ్వడానికి సిద్ధపడ్డాడు. అప్పు డెంతో సబబుగా కనిపించింది. ఎవళ్లూ ఇంట్లో తోడులేకుండా చిన్నవయసులోనే నాలుగేళ్ల కొడుకుతో నానా బాధలు పడుతున్నది తన భార్య సత్యవతి. ఈ నాగమణిలాటివాళ్లు వెనకాల సాయంఉంటే ఎంత బాగుంటుంది! సాయమంటే ఇంట్లో చాకిరీ చేసిపెట్టాలని కాదు. ఆ పనికి వేరే మనుషు లున్నారు. ఆ విషయం తా నా విడకు స్పష్టపరిచే చెప్పాడు. ఒకరి కొకరు సాయంగా ఉంటే చాలును. తానూ ఆర్థికంగా స్థిరమైన సదుపాయమైన ఉద్యోగమే చేస్తున్నాడు. తన కెవరూ అక్కచెల్లెళ్లు లేరు. ఆ లోటు తీర్చేట్టుగా ఆమెను చూసుకుంటాడు.

ఎంతో సహేతుకంగానూ న్యాయ సమ్మతంగానూ తోచింది, తాను చేస్తున్న పని అప్పుడు. ఆమె ఒప్పుకో లేదు ముందు. ఎంతో యిదిగా తాను రకరకాలుగా బోధపర్చి చెప్పాడు. చివరకు పాసింజ రింకో గంటకు వస్తుం దనగా ఒప్పుకుందామె.

నాగమణి అడుగుతున్నదానికి సమాధానం ఆలోచించి చెప్పవలసిన అవసరం కలిగి, ప్రవాహంలో వచ్చిన అడ్డు తొలిగి మళ్లీ మామూలు దారిని పడింది రెమ్మ.

నాగమణి : "దారిలో మన భోజనమెక్కడ ?"

"ఆఁ?...పలాసా. టైముంటుందిలే పలాసాలో ?"

"పరధ్యానంగా ఉన్నట్లుందే!"

నవ్వుతూ అన్నాడు భాను. "పరధ్యానమైతే జవాబెలా చెప్పాను."

ఆమె నవ్వుతూనే అంది : "చెప్పొచ్చు. ఎంత పరధ్యానంగా ఉన్నా వినబడుతూనే ఉంటాయి. జవాబు చెప్పాల్సివస్తే ఆఖరు మాట లొకసారి మనసులో అనుకుంటే సరి, అర్థం బోధపడుతుంది. ఇందాక నిద్రమత్తుగా ఉన్నప్పుడూ ఇలాగే చేశారుగదూ ?"

ఎంత చలాకీ ఐన మనిషి ! అందుకే ఇంతలా పెనవేసుకుపోయింది తన జీవితంలో నాలుగురోజుల్లోనే యీమె.

ఆలైట్రా వైపు చూశాడు. పర్సక్కడే ఉంది. తనచూపులననుసరించి ఆమె చూపులూ దాని మీదే వాలాయిగాబోలు నాగమణి అంది నవ్వుతూ :

"పర్సెవ్వరూ కాజెయ్యరు లెండి—మన మిద్దరం ఉండగానే ?"

"అదిగాదు—ఊరికేనే."

"అలా వెళ్ళేటప్పుడు బజారులో ఏమన్నా కొనాలిగాబోలు !"

"లేదులే, జేబులో నాలు గైదు రూపాయల చిల్ల రుంది."

"అవునుగాని, ఎందు కలా ఖర్చుపెడతారు డబ్బు ? ఈ నాలుగైదు రోజుల్లో చాలా ఖర్చైనట్లుంది నా గురించి."

"ఏం ఖర్చది పోనిద్దూ."

పర్సుతీసి చూస్తుందేమోనని అనవసరంగా భయపడ్డాడు భాను, తనక్కడే ఉండగా ఆ ఉత్తర మామె చూసిందంటే ?

తనకు ధైర్యంలేదు. కాగితంమీద రాయగలిగిన మాటలామెతో చెప్పేస్తే ? అయిదారుమార్లు వెనుకకూ ముందుకూ తిరుగుడు పడ్డాయి ఆ ఉత్తరంలో రాసి ఉన్న మాటలు తన మనసులో, నాటకంలోవలె రాసినట్లున్నాడు :

"జారి పోతూన్న నాగమణికి—

అనుకున్నదొకటీ, అయిందొకటీ.

ఈవిధంగా జరిగిన తర్వాత నిన్ను తీసుకువెళ్ళి ఇంట్లో ఉంచలేను. మరోవిధంగా చేసే అవకాశంలేదు. పర్సులోసుమారు రెండువందలున్నాయి. నీపై అభిమానంతో మటుకే ఇవి వదలడం.

ఏమి రాయడానికీ తోచడంలేదు. క్షమించు, నిన్ను పోగొట్టుకుంటున్న-భాను."

ఆమె ఏదో మాట్లాడుతూంది. రెండుమూడు సార్లు నోరు విప్పబోయాడు కాని అవకాశం కలగలేదు. కలిగినా ఉపయోగించుకునే శక్తిలేనట్లుంది పెదవులకు. లాభంలేదు. నోటితో చెప్పలేడు.

డబ్బువదిలి వెళ్తున్నందుకే మనకుంటుందో ? ఏ మనుకున్నా తనకు తిప్పిపంపే అవకాశంలేదు. ఊరిపేరు తప్ప అడ్రెస్ చెప్పలేదే తాను.

ఏమైనా తన విధితాను నెరవేరుస్తున్నాడు.

నాగమణి అంటున్నది : "తప్పకుండా వెళ్లాలేమిటి వాళ్లింటికి భోజనానికి ?"

"లేదు, నారాయణ మరీ మరీ బలవంతపెట్టాడు, వెళ్లకపోతే బాగుండదు"—తడుము కోకుండా చెప్పాడు సమాధానం. చిన్నప్పటినుండీ స్నేహితుడు, నిన్న భోజనానికి పిలిచినప్పుడు రావడానికి వీలుకాదన్నాడు తాను; ఏమనుకున్నాడో ? లేచాడు తాను కుర్చీమీదనుండి.

ఆమె అంది : "ఇప్పటినుంచీ లేస్తున్నారేమి ?"

"ఇంకా అఫీసుపనుంది. అది చూసుకొని అలాగే భోజనమూ పూర్తిచేసుకుని వస్తాను. తొమ్మిదిదాటుతుందిలే వచ్చేటప్పటికి." తడబడకుండా మాట్లాడానికి ప్రయత్నించి కృతకృత్యుడయ్యాడు.

"నీళ్లు తెప్పిస్తానుండండి."

నీళ్ళు వచ్చాక వెళ్లి మొగం కడుగుకుని లోపలకువచ్చాడు. తల దువ్వుకు నేటప్పుడు నాగమణి అడ్డువచ్చి తానే దువ్వింది. దువ్వెన దులుపుతూ అడిగిం దామె:

"డూప్లికేటు తాళం మీ దగ్గిరుంది కదూ ?"

"ఏమి ?"

"మీరు వచ్చేంతవరకూ ఒక్కదాన్నీ—ఏమీ తోచదు. అలా ఎక్కడికన్నా......"

"సినీమాకు వెళ్లకూడదూ పోనీ ?"

"చూద్దాంలెండి."

భాను గడపదాట బోతుండగా చేయి పట్టుకుని వెనకకు లాగి తిన్నగా కళ్లల్లోనికి చూస్తూ అడిగింది ; "వేగం వచ్చేస్తారు గదూ ?" ఆమె కళ్లనిండా నీళ్లు నిండుకుని ఉన్నాయి. భాను తటపటాయించి రెండడుగులు వెనకకువచ్చి ఆమెను దగ్గరకు తీసుకుని చెక్కిళ్లమీద ముద్దుపెట్టుకున్నాడు. అతని నోటి చివరవరకూ వచ్చింది : "మరిభోజనానికి వెళ్లనులే !" అని ; ఇంతలో మధు సెత్తుకున్న సత్యవతి మూర్తి అతని తలపు తెరమీద గోచరించింది. ఎందుకంత కోపంగా చూస్తున్నది, సత్యవతి ? లేదు—నాగమణి కక్కడ స్థానం లేదు.

జాలిగా అన్నాడు : "ఒకపూట ఆలస్యానికేనా బెంగ, వెర్రినాగూ ?"

* * *

స్విచ్ వేసే ఉండడాన్ని, హోటల్ మెయిన్ స్విచ్ వెయ్యడంతోనే టేబుల్ లైట్ వెలిగింది. కాని ఇంకా సరిగా చీకటిపడక పోవడంవల్ల కిటికీలోనుండి లోపలకు వచ్చే సంజ వెలుగులలో అదంత ప్రకాశవంతంగా కనిపించడంలేదు. మంచంమీద వోరగిల పడుకుని గోడవైపునకు తల తిప్పుకుని ఉన్న నాగమణి ఉలికిపడి ఇటు తిరిగి చూసింది. ఎవరూ లేరు.

ఏమిటి ఆలోచిస్తున్నది తాను ? నిద్రపట్టినట్లుంది. ఏదో కలవచ్చింది నిద్రలో, సరిగా జ్ఞాపకం తెచ్చుకోవడానికి ప్రయత్నించింది.

ఆ కలలో—తాను సావడిలో పడుకొని ఏడుస్తూంది. అవతల గదిలోనుండి ఎవరో స్త్రీకంఠం పాడుతూండడం వినిపిస్తున్నది. ఉన్నట్లుగా ఉండి ఎవరో పకపక నవ్వడం మొదలుపెట్టారు. ఆ స్త్రీ కంఠమూ పాటమాని కిలకిల నవ్వుతున్నది.

ఆ పక పక మనే నవ్వు !

ఆయన, తనభర్త ! ఆయనే నవ్వుతున్నాడు.

తరువాతేమిటో సరిగా జ్ఞాపకం రాలేదు కల. ఎక్కడో ఒక కారడవిలో తాను పరుగెత్తుతున్నట్లుగా కూడా అయినట్లుంది.

ఎంత భయంగా అనిపించింది తనకా కలలో! ఆ స్త్రీ......

ఆయనెప్పుడూ పరస్త్రీల జోలికి పోయేవారు కాదు, తనను కురోవిధాల ఎంత బాధపెట్టినా. మరీ కలకర్థం ?

బల్బువైపే చూస్తున్న ఆమె కళ్లు కొద్దిగా ఉబ్బి ఉన్నాయి. చెక్కిళ్లమీద ఎండిన కన్నీటి చారలు అంతకంతకూ స్పష్టమవుతున్నాయి.

ఆ బల్బుకు వెనకాల ప్రాపుగా డూమూ, స్టాండూ. ఆ కాంతి కాధారంగా కరెంటూ, ఇవి లేకపోతే ? అసలది నిలవగలదా యీ విధంగా, కాంతి మంతంగా ?

ఇదే ఆలోచన వచ్చింది ఆరోజు—ఎనిమిదేళ్లైనట్లుంది. ఫోర్తుఫారమ్ చదువుతున్నది తానప్పుడు. నాన్నపోయాడని టెలిగ్రాం సాయంత్రం వచ్చినప్పటినుండి ఏడ్చి ఏడ్చి చివరకు మరి ఏడ్చే శక్తిలేక, గోడ కున్న లైటువైపు చూస్తూ ఇలాగే పడుకుని ఉంది ఆ వేళ తాను. ఎంద రెందరో తోడి విద్యార్థినులు వచ్చి ఓదార్చడానికి ప్రయత్నించి వెళ్ళిపోతున్నారు. అప్పుడూ ఇదే ఆలోచన వచ్చింది. నాన్నే ఉంటే ? తనీ స్థితిలోనికే వచ్చి ఉండేది కాదు.

ఆ రోజు రాత్రి హాస్టలు వదిలి ఊరికి వెళ్ళుతున్నప్పుడు మరి తిరిగి అక్కడ అడుగుపెట్టుతానని అనుకోనేలేదు. బ్రతికున్నంత కాలం నాన్న తాము బీదవారమని ఎప్పుడూ తనకు తెలియనివ్వనే లేదు.

అమ్మ—అమ్మమటుకేం చేసింది ? ఏదో కూతురును ఒక ఇంటిదాన్ని చేసి సుఖపెడదామనుకుంది. కాని యీవిధంగా అవుతుందని కల గన్నదా !

తనతప్పే ఉండేదేమో ఆయనతోడిబ్రదుకులో సామరస్యం కుదుర్చుకోలేక పోవడంలో? తప్పొప్పుల నిర్ధారణచేసి ఏం ప్రయోజన మిప్పుడు ?

అదీ కొంతమంచిదే అయింది, తన పెళ్లయిన కొద్దిరోజులకే అమ్మపోవడం. లేకపోతే ఎంత బాధపడి ఉండేదో తన యీ దుర్గతికి !

తనకు ధైర్యం లేకపోయింది. ధైర్యం లేకపోవడంకాదు. బ్రదకలేక చనిపోవడం పిరికితన మనిపించిం దప్పుడు. లేకపోతే ఆ యింట్లో ఉన్న లోతైన నూతి చల్లని నీళ్లు శారీరకంగా, మానసికంగా, తనకు బాధలనుండి విముక్తినిచ్చి ఉండేవి. అప్పుడే సాహసంచేసి ఉండవలసింది, తన జీవితం యిలా పక్కదారి తొక్కినప్పుడే ! ఇప్పుడా ఆలోచన అనవసరం.

ఆరోజు గవరయ్య—తనతో ఫస్టుఫారమ్‌వరకూ చదివి మానేసిన గవరయ్య—మళ్ళా తన జీవితంలో ఎందు కడుగుపెట్టాడు ! ఆ ఊళ్ళోకి తను రాకుండా ఉంటే ? తన కాతను కనిపించకుండా ఉంటే !

ఇది కాకపోతే—అదికాకపోతే—ఎందుకీ వృథా ఆలోచన ?

కాని, అయింది మర్చిపోవడ మెలా ?

అయిదు రోజులకిందట......

పూరీలో జరిగిన సంగతి జ్ఞాపకంవచ్చింది.

పంచదార వేసిన పెరుగు తెచ్చిచ్చాడు హోటలు బ్రాహ్మణుడు. గవరయ్య తలవంచుకుని తొందరగా తింటున్నాడు. తనకా తీపి సహించలేదు. "మామూలు పుల్లమజ్జిగ కావాలా ?"

అని అడిగింది తాను, కిందకు వంచిన గవరయ్య కళ్లల్లోనికి తిన్నగా చూడడానికి ప్రయత్నిస్తూ.

కసిరికొట్టినట్లుగా అన్నాడు: "ఇల్లనుకున్నావేమిటి ? కొండమీది కోతిని తెచ్చిపెట్టడానికి నేనేం మోళీవాణ్ణిగాను."

ఆయనే, తనభర్తే నయం. మొదటనుండీ ఒకటే విసుగూ, కోపం; కాని ముందు మంచి మాటలూ తరువాత మరోవిధం లేదు.

ఇల్లు వదలి అతని వెంట కుక్కలా వచ్చేలా తనను సమ్మోహనంచేసినవాడు త్రోవలో లారీ ఆపి తానడిగానని వెళ్లి చెరువులో తామరపూలు కోసుకొని తెచ్చిన గవరయ్యే, నిర్దాక్షిణ్యంగా పైదేశంలో తనను వదిలేసి మాయమైపోయాడు !

చిన్నప్పటినుండీ అద్దంలో చూసుకొని ఎంతో గర్వపడేది తాను తన అందానికి కాని. ఆ అందమూ పరులతో సామరస్యం కుదుర్చుకోవడంలో తనకు సహాయపడటంలేదు. ప్రతీవాళ్లూ తన అందాని కాకర్షింపబడేవాళ్లే. కాని చివరకు పురుగుకన్నా హీనంగా తన్ను దులిపి వేస్తున్నారు.

ఏదో అహంభావం చిన్నప్పటినుంచీ తనకు. తనొక్కతే పై అంతస్తునకు చెందినదనీ, తక్కినవాళ్లందరూ అడుగంతస్థుల వాళ్లనీ. ఆ అభిప్రాయం మనసులోనే ఉంచుకుంటే బాగుండేది కాని ఎంతగా అణచుకున్నా అణిగేది కాదది. ఎప్పుడో తనకు తెలియకుండానే పైకి వచ్చేసేది.

మొదట ఆయన, తరువాత గవరయ్య, తరువాతనారాయణ—

నారాయణకు మటుకు తానా అవకాశం ఇవ్వలేదు. అవసరం తీరిన వెనుక తనను పురుగులా అవతలకు విసిరివెయ్యడానికి! ఎంత చొరవ నారాయణకు ! ఆ ఉద్దేశం అతని కుందని తెలుస్తే తానసలా హోటలుకే వెళ్లకుండా ఉండే దతనితో. భోజనాని కన్న వంకపెట్టి ప్రత్యేకంగా మేడ మీది గది కతడు తనను తీసుకు వెళ్లేటప్పుడన్నా గ్రహించు కోవలసింది.

ఎన్ని ముక్కలు చేసేసిందతడివ్వబోయిన అయిదు రూపాయలనోటు తాను !

భాను—

అలాటివాడుకాదు భాను. మళ్ళా వస్తాడు తనకోసం. రాకుండా ఉంటే ? ఈ రెండురోజుల్లోనూ ఎన్నిసార్లో అనుకుంది. అతడు రాకుండాఉంటే బాగుండునని కాని అతడు మటుకు రావడం మానలేదు—మానలేదు కూడాను. వాళ్లకీ, భానుకీ ఎంత తేడా !

భాను నా స్టేషనుహాల్లో చూడటంతోనే ప్రాణంలేచి వచ్చినట్లయింది. అంతకుముందు తన నుద్దేశించి అన్న రెండు మాటలూ మందలిస్తున్నట్లుగా అన్నా అతనే ఎక్కువ దగ్గర వాడిలా కనిపించాడు తనకు.

భోంచేశారా అని అత డడిగినప్పుడు నారాయణ సంగతంతా అతనికి చెప్పాలని ఏడుపొస్తున్నట్లనిపించింది తనకు. కాని చెప్పలేక పోయింది.

తన దీనత్వం మాపుకోకుండా ఉండామని ఎంత ప్రయత్నించినా భాను దగ్గిర సాధ్యంకాలేదు, అత డడిగిన ప్రశ్నకంత వరకూ దిగమ్రింగుతుంటున్న ఏడుపు పైకి వచ్చేసింది. ఎందుకలా అయిపోయింది తను ? తన అహంభావం పూర్తిగా దిగజారిపోవడ మితని దగ్గరే !

అతనితో అబద్ధాలు చెప్పాలని చెప్పలేదు తాను. కాని తన పతనం సంగతి చెప్పకోలేక పోయింది. మరో క్షణైతే నమ్మేవాళ్లుకాదు తన మాట లన్నీ. ఎంత అమాయకుడు భాను !

తన గాథ విని అతడు జాలిపడి డబ్బివ్వబోయినా కోపం రాలేదు. తనకు ఎక్కడకు పోయిందో తన అహం భావం !

అతని వెంట వెళ్లి అత నింట్లో నీతిమంతురాలిలా మసలగల ననుకుని తాను తయారవడం పిచ్చిలో పైఅంతస్తు. అతని సుహృద్భావనూ, నైతిక వాతావరణంలో అలవర్చుకొన్న నడవడీ మటుకే లెక్కలోనికి తీసుకుందిగాని, అతడూ మొగవాడే అన్న సంగతి మర్చిపోయింది. అంతేగాదు, తన యీ ఛండాలవుటందమో! సమయాని కితని ఎదుట ఆరోజు స్టేషన్ హాల్లో తానందగత్తె నన్న విషయమే స్పృహకు రాలేదు.

తామిద్దరూ ఈ ఒంటరి కాపురం పెట్టకుండా అక్కడనుండి అలాగే తిన్నగా అతనింటికి వెళ్లిపోతే బాగుండేది. అతనిభార్య, కొడుకూ, ఆవాతావరణంలో......

లాభంలేదు. ఎప్పుడో ఒకనాడిది జరిగి తీరేదే ! పైభాగం నగుసుచేసి ఇల్లు కట్టుకున్న తర్వాత కాకుండా ఇప్పుడే ఈ అగ్నిపర్వతం బ్రద్దలవడం మంచిదే అయింది.

ఇక్కడే—అప్పుడే మూడురోజులైంది.

ఆ వేళకూడా అంతకు క్రిందటిరాత్రిలాగే ఇద్దరూ విడివిడిగా రెండు మంచాలుమీద పడుక్కున్నారు మొదట... కాని......

తనదే తప్పు. మొగంవాచిపోయి ఉన్నదానిలా అతడు తెచ్చిన విలాస వస్తువు లన్నీ ఉపయోగించుకుని సన్నని మెరమెరలాడే తెల్లని వాయిల్ చీర కట్టుకుని తయారయింది తాను. తనకంటే అంతపై ఎత్తులో ఉన్న అతన్ని క్రిందకు పడగొట్టాలని తనలో దాగిఉన్న అహంభావపు పట్టుదలేమో !

మూడురాత్రిళ్లు !

ఇదివర కెప్పుడూ శరీరానికింత పవిత్రత ఉందని తననుకోలేదు. ప్రతి ఫలాపేక్ష లేకుండా మరొకరి కానందం ఇవ్వగలశక్తి తనలో ఉందనే తానెరగదు.

ప్రతి ఫలాపేక్షలేదా తనకు ? తాను పొందిన అతి లోకమైన ఆనందం ? కాదు—అపేక్షించి పొందలేంది తాను.

తన కతడు ముందు జీవితానికి చూపుతున్న వెలుగులు ? ఆ ఉద్దేశ్యమే తన మనసులో లేదు.

ఉంటే అతన్నావిధంగా చేయనిచ్చేదే కాదు తాను.

ఇప్పుడు మరి లాభంలేదు. మళ్లీ తెరలు తెరలుగా శోకతి వచ్చింది దుఃఖము.

ఎక్కడెక్కడికో వెళ్లి మళ్లా అతడు తిరిగి వస్తూనే ఉన్నాడు తన దగ్గరకు.

అతని సత్యవతీ, అతని మధూ, ఎందుకు జ్ఞాపకం రారతనికి? తనకే విధమైన సంబంధంగల యువతిని తీసుకువెళ్లి ఎలా ఉంచుదామనుకున్నాడు వాళ్ల నడుమ!

ఈ ఆలోచనలతనికి వస్తే తనింత బాధ పడవలసిన అవసరమే ఉండేది కాదు. ఎంత అమాయకుడతను, తన జీవితాని కతి ముఖ్యమైన ఘట్టంలో నిశ్చయానికి వచ్చే గురుతరమైన బాధ్యత ఒకపటుత్వం లేని చేతిలో ఉంచి తనకేమీ సంబంధం లేనట్లే తిరుగుతున్నాడు! అతని కా బాధ్యత ఉన్న స్పృహే లేనట్లుందసలు.

లేచి కూర్చుంది. మెరుపు కొట్టినట్లుగా జ్ఞాపకం వచ్చిందిందాకటి కల.

అవతలిగదిలో ఆ నవ్వులు వినలేక పోయిన తాను చివర కొనడుము నున్న తలుపులు పగులగొట్టి లోపలకు వెళ్లి వాళ్ల నెదిరించి నిలబడి గర్జించింది. ఆయన కళ్లు జేవురించాయి. ఉగ్రమూర్తి అయి మీదకువచ్చి చావగొట్టారు. ఆయన దెబ్బలనుండి తప్పించుకుని ఆమెమీదకు వెళ్లి కసితీరా కొట్టడం మొదలు పెట్టింది తాను. ముందామె తిరగబడింది కాని తరువాత బెదిరిపోయి పరుగెత్తి పరుగెత్తి ఒక అడవిలోనికి దూరింది. తానూ ఆమె వెనకాలే పరుగెత్తుకుని వెళ్లింది అడవిలోకి. తమ వెనకాల ఆయనా వస్తున్నారు పరుగున. చివరకందరూ అడవిలోనే అల్లాడుతూ ఉండిపోయారు.

ఆకల అర్థం ఇప్పుడు బోధపడ్డది. భాను ఇంటికే తాను వెళ్లితే, సత్యవతి సుఖపడినప్పుడు తాను ఆనందించలేదు; తాను ఆనందిస్తే సత్యవతి సుఖం పొందలేదు.

చివరి కిద్దరకూ నరకమే! భాను ఇద్దరి నడుమా నలిగి పోతాడు—

ఇన్నాళ్లుగా తన కందని మాధుర్యం అక్కడ దొరుకుతుందనుకోవడం వెర్రి—లాభం లేదు.

లేచి టేబిల్ దగ్గరకు వెళ్లింది. లెటర్ పాడ్ అట్టపై, "రెక్కలు చాచుకొని తీరికగా" నీలాకాశంలోనికి ఎగిరిపోయే గరుడపక్షి బొమ్మమీద వాలాయామె చూపులు. ఎంతనిశ్చలంగా ఉన్నాయి దాని కళ్లు!

బిగించిఉన్న పిడికిళ్లు విప్పి, ఎంబ్రాయిడరీ జాగా ఉంచిన అట్టపెట్టెలోనుండి పెన్సిలు తీసి టేబుల్ దగ్గరకు కుర్చీ లాగుకొని కూర్చుని లెటర్ పాడ్ విప్పిందామె.

పాలమీగడలా తెల్లగా ఉన్న దా కాగితం, తా నాతని కిదివరకు చెప్పని నిజమంతా రాయమని ప్రోత్సాహమిస్తూ.

* * *

ఆ హోటలు ముందుహాల్లో గడియారం మరో పది నిమిషాలకు ఎనిమిది గంటలు కొట్టబోతుందనగా గోధుమరంగు చీర కట్టుకొన్న ఒక ఆడమనిషి హోటలునుండి వెళ్లిపోవడం చూసి, "ఎవరది?" అని అడగబోయిన మేనేజరు ఆమె ముఖం నిదానంగా పరిశీలించి మళ్లీ ఊరుకున్నాడు.

కాని అతనికి వింతగా తోచాయి, హోటల్లోకల్లా ఖాళీ ఎక్కువైన గదుల వరసలో ఉండే స్త్రీ చేతిలో కనిపించిన మాసిన ఆకుపచ్చని చీరా, నీలి దుప్పటా.